# అయణరాగం

"ఓహో మీరా! దయచేయండి" అని చిరుసిగ్గుతో అతనిని ఆహ్వానించింది అరుణ. చందనం బొమ్మకి ప్రాణం వచ్చిందా? కోకిల పాడుతోందా? అన్న భ్రాంతిలో తెల్లపోయాడు సుబ్బారావు.

---

"ఒరేయ్ సుబ్బారావ్! ఆ అమ్మాయి వరస ఏమీ బావుండ్లేదురా!"

"ఏం"

"గట్టిగా సుడిగాలి వీస్తే ఎగిరిపోతుందేమో అన్నంత నాజూగ్గా వుందా? బుగ్గమీద వేలుపెడితే రక్తం చిమ్ముతుందేమో అన్నంత మృదువుగా వుందా? ఇంతలా వున్న నాకే కంగారుపుట్టిస్తోందిరా!"

"ఎవరబ్బా ఆ చిన్నది?"

"సౌందర్యానికి దృష్టిదోషం తగుల్తుందేమో అని ఓలావుపాటి పుస్తకాలదొంతరా, కలువ కన్నుల్లోంచి తేనియలు జాలువారునేమో అని నల్ల కళ్ళద్దాలూ, పెదవి కదిపితే రతనాల వర్షం కురుస్తుందేమో అని ఎప్పుడూ బిగించిన నోరూ, ప్రతిరోజూ తొమ్మిదిన్నరకి పుత్లీ బావుడీ బస్సుస్టాపు వద్ద ప్రత్యక్షమవుతుందే? ఆ అమ్మాయి."

"ఏం? కొంపదీసి ఆమెని నీవు ప్రేమించడం లేదుగదా?"

"అంత పెద్దమాట నాకు తెలీదుగానీ, ఆమె కనిపించిన రోజునుంచీ గుండెలో ఏదో బరువు ప్రారంభమైందిరా! తిష్ఠ వేసికుని కదలకుండా కూర్చుందిగావును హృదయంలో"

"అయ్యో పాపం! నిక్షేపంలాంటి సుబ్బారావుకి పెద్ద జబ్బేనే! త్వరగా ఓ సర్జన్‌ని కన్సల్టు చేస్తేనే మంచిది నీ దేహానికి"

"నీ సలహా మండిపోనూ"

"లేకుంటే ఏమిటిరా సన్నాసీ! ఆమెవరూ, నీ వెవరూ, కులం, గోత్రం, సాంప్రదాయం చూడక్కర్లా? అందమైన అమ్మాయి కన్పిస్తే చాలు హృదయం, గుండె, ప్రేమా, గీమా అన్నీ పుట్టుకొస్తాయి. ప్రేమించడమంటే సోడా తాగడమనుకున్నావా; సిగరెట్టు కాల్చడమనుకున్నావా?"

"ఒరే బ్రదరూ! నాకంతా తెలుసుగానీ కాస్సేపు నీవు మాటాడకు" అద్దంలోని గిరజాల సుబ్బారావుకీ, గళ్ళ బుష్‌షర్టు సుబ్బారావుకీ మధ్య కొద్ది రోజుల్నుండీ ఈ వరసలో సంభాషణలు జరుగుతున్నాయి.

నిజానికి సుబ్బారావుకి ప్రేమమీదగాని, అందం మీదగాని నమ్మకంలేదు. తన "బాయ్ మీట్సు ది



గరల్'' కథల్లో ఎందరో అమ్మాయిల్ని వర్ణించాడు. అందమంటే ఎత్తుపల్లాలు, కాకుంటే రంగుల అమర్పా అని వేదాంతిలా నిర్ధరించుకున్నాడుకూడా — ఎందుకోగాని ఈ సుందరి ముఖారవిందంలో మందహాసం సందర్శించాలని ఆకాంక్ష బయల్దేరింది. ఆమెను చూచినరోజునుంచీ తనలో ఏదో విద్యుత్ప్రవాహం ప్రసరిస్తోంది.

పుల్లిబావుడీ బస్సుస్టాపే యేమిటి, ఆంధ్ర రాజధానీనగరం మూలమూలలా నాగరికతకి ప్రతినిధులైన స్త్రీలెందరో కన్పిస్తారు. తమ విశాలదృక్పథాన్ని వెలువరిస్తూ, అధునాతనాంధ్ర నారీమణులు, పంజాబీ, గుజరాతీ, మహారాష్ట్రేత్యాది వేషాల్లోనూ, అంతేకాక ప్రాక్పశ్చిమసంస్కృతీ సమ్మేళనానికి రూపాంతరాలుగాను, దర్శనమిస్తారు. సుబ్బారావు రూంమేటూ, అంతరంగికుడూ అయిన శంకరానికి అలాటి స్త్రీలకేసి చూస్తూ ఉబుసుపోకకి బ్యూటీ అప్రిసియేట్ చేయడం సర్దా! పైగా అమాయకుడైన సుబ్బారావుకి ఉచితసలహా లిస్తూ డలాచేయమన్ని. సాయంకాలమౌతూనే మేకప్ చేసికుని తిన్నగా అలా పర్యటించిరావడం వాడి ఆచారం. సినిమాహాల్సూ, బస్సుస్టాప్సూ, డబుల్ డెక్కర్స్, గార్డెన్సు, సుల్తాన్‌బజారు, నియమంలేదు. యత్రయత్ర స్త్రీ అస్తుతత్రతత్ర శంకరంగాడు. రాత్రి రూముకి రాగానే 'రేడియో' ఆన్ చేస్తాడు. బ్యూటీ కామెంట్ చేస్తూ, ఎక్కడెక్క డెవరెవరు ఎవరెవర్ని లవ్ చేశారో, చేయనున్నారో, ఎవరెవరికి ప్రాయశ్చిత్తాలు జరిగాయో వరసాగా ప్రాంతీయ వార్తలతో బోరెక్కిస్తాడు.

మరేమో తనకది కిట్టద ...ళ్ళలో ఏదో లోపముందని శంకరం సిద్ధాంతీకరించాడు. భవతు— కాని ప్రస్తుతం ఈవిషయాన్ని వాడితో ఎలా ప్రస్తావించడమా? అని. గిరజాలజాలంలో వేయి దూర్చి ఆలోచించాడు సుబ్బారావు. ఏది యెలాగైనా ఈ సంగతి వాడితో చెప్పనుగాక చెప్పను అనుకున్నాడు — వేళాకోళంపట్టించి చంపగలడు.

"ఒరే సుబ్బారావూ! బొద్దుగా, పుష్టిగా, నిటారుగా బాగానే వున్నావ్‌కదా! ఆమె అగుపించేసరికే గుండెలలా పీచు పీచుమంటాయేం? మళ్ళీ ఇంటి కొస్తేనేమో వెధవ విరహం. రచయితవు కదా! మనసులోది పసికట్టలేవూ? ధృతి చెడితివా మతి చెడేను. దిగులుపడితే వెతలు మిగిలేను. కళవళపడకుండా మెలకువ ... ఎలుకరించు'' ఏపు చరచుకుని ... చేసిన మీసంపై చేయి వేశాడు.

...ండి సుబ్బారావుకి ఓ పెద్ద అనుమానం కలిగింది. ఆమెకళ్ళు కలువల్లా ఉంటానికి బదులు పస్పెన్సు కథల్లోకిమల్లే కళ్ళల్లోనే కలువలు కాపురం చేయడంలేదుగదా కొంపదీసి. లేకుంటే అస్తమానూ ఆ కళ్ళజోడేమిటీ? 'అమంగళముపశమించుగాక' అని చెవులు మూసికుని ఎదురుగుండావున్న గాంధీఫోటోకి నమస్కరించాడు. చేతివాచీలో తొమ్మిది అయిన సూచన కన్పించింది

లే.. గళ్ళబుష్ షర్టూ, పెసరరంగు పనామా ప్యాంటూ వేసుకుని, గిరజాలు దువ్వి, తిన్నగా బస్సుస్టాపు చేరుకున్నాడు.

నల్లని మేఘాల్లో తటిల్లత తళుక్కు మన్నట్టుగా సిమెంట్‌రోడ్డుపైనుంచి 'సులోచని' మెరుస్తూ వచ్చి చేరింది. పక్కహొటల్లో వడలు వేయించే వాసనా, అమ్మాయి జడలో మల్లెచెండు పరిమళమూ స్మైమల్టేనియస్ ...డు ముక్కుల్లోకి జొరబడుతున్నాయి.

సౌందర్యానికి సరియైన నిర్వచనం ఈమే అనుకున్నాడు సుబ్బారావు. ఈమెను చూస్తే కలాలూ, కాగితాలూ, శబ్దాలూ, భావాలూ, పోటీపడి కవిత్వాన్ని సృష్టించవూ? అనుకున్నాడు.

(15-వ పేజీ చూడండి)



వదిలంగా తల పక్కకితిప్పి ఆమెకేసి చూచాడు. ఆమె కళ్ళద్దాల్లో లాంగ్ షాట్‌లో తన ప్రతిబింబం కనిపించడమేతప్ప ఆమె ఎటుకేసి చూస్తోందో తెలిసిచావదుగదా! ఖర్మరా నాయనా! పెదాలు మాటనీయదుగదా చిరునవ్వుని!

చిన్నగా దగ్గి తనలోఉన్న మర్యాదనీ, మార్ధవాన్నీ కూడదీసికున్నాడు. ఏమని పలుకరించడమబ్బా! బెడిసికొడితే డేంజరుగదా! నాలుక డబుల్ కొట్టిలా తడారిపోతూాందేం?

'శ్రీమతే రామానుజాయనమః' తన భయానికి తోడు ఈయనొహడు. శివలింగాకారంలో బట్టతలా, గొంగళీపురుగుమార్కు మీసాలూ, పట్టెనామాలూ, చత్వారంకళ్ళజోడూ, గొడుగూ, ఆయుర్వేదవైద్యరత్న ఆచార్యులవారు ప్రవేశం. ఆయన నిష్క్రమించేదాకా అమ్మాయి ప్రాణ్ముఖం చేస్తుంది. ఆయనకీ సౌందర్యారాధన తెలుసన్లేదుంది పాపం. కదలడుగదా స్థాణువులా. ఉన్న ఫళంగా ఆయన్ని మింగేద్దామా అనుకుని పోనీ పాపం ఆయనేంచేశాడు అని కోపాన్ని మింగేసి బస్సు వచ్చేవరకూ ఆయనతో ఏదేనా బాతాఖానీ వేసుకుంటే మంచిదనుకున్నాడు.

"ఆచార్యులవారూ! మీ తిరు దవాఖానా ఎక్కడ పెట్టారండీ ఇప్పుడు?" నాలుక చివరిదాకా వచ్చిన ప్రశ్నని మళ్ళీ వెనక్కి నెట్టాడు—అదో బోరింగ్ పని. మాటాడితే పురాణం చెప్పేరకం.

8 వ నంబరు బస్సొచ్చింది. లేడిపిల్లలా ఛెంగున దాన్లోకి దూరిపోయింది. ఆ పరిసరాల్లోని వెలుగంతా ఆమెవెంటే పోయినట్లుంది.

* * *

ఈ పద్ధతిలో ఎన్నిరోజులు గడపడమబ్బా! నాన్నగారేమో సాక్షాత్తూ సోమపానం సామగానం కాలంనాటి మనిషి. పెద్దాళ్ళు అనుమతుల్లేకపోతే ప్రేమా పెళ్ళీ అంతా సాళ్ళీ—ఇంతకూ ఆమె ఎవరు? ఎక్కడుంటుంది? ఏంచేస్తుంది? వుమన్స్ కాలేజీలో చదువుతోందిట. అయినా తానిల్లా ఇల్లాటప్పాగా ప్రేమించేశాడేమిటీ? ఆమె తనని ప్రేమిస్తోందో లేదో తెలిస్తే బావుణ్ను! డిటెక్టు చేయాలి!

"భగవాన్! ఈ కథ ట్రాజడీ కాకపోవుగాక!" అని దేవుడికి నమస్కరించి డ్రాయరుసొరుగులోంచి కాగితాలూ కలం తీసికున్నాడు సుబ్బారావు. గబగబా రాసేస్తున్నాడు. పేజీలు నిండుతున్నాయి. ముంగురులు ముఖాన్ని కప్పుతున్నా, చెమటలు కారిపోతున్నా, బయట కూరగాయలబండీవాడు అరుస్తున్నా ఏమీపట్టకుండా ఏకదీక్షగా కలం నడిపించాడు.

భావసమాధిలోంచి మేల్కొని "హమ్మయ్య" అంటూ నిట్టూర్పు విడిచి, ముఖాన్ని తుడిచి, కాగితాల్ని మడిచి, కవర్లోపెట్టి, ఎడ్రస్ రాసేశాడు.

"సుబ్బరాయా! ఇక ప్రాసీడవు. జలనిధులింకనీ, సూర్యుడు పశ్చిమాన ఉదయించనీ, ఇంతెందుకు? ప్రపంచం తలక్రిందులవనీ వెళ్ళు! ఆమె ఇల్లెక్కడో కనుక్కునిరా! భూయాచ్ఛుభం!" అంటూ ఆశీర్వదించుకుని, బయలుదేరి, వడివడిగా నడుస్తూ, రెన్డో మేడలు గడిచి, కారులబారినుంచి తప్పించు

# అరుణరాగం

(25-వ పేజీ తరువాయి)

కుని రిక్షాలనుంచి రక్షించుకుని, ఎర్రడబ్బాలో కవరు పడేసి పుల్లీబావుడి బస్సుస్టాపు చేరుకుని "హా భగవంతుడా! ఒక్క చిన్నదాని చిరునవ్వుకోసం ఎన్ని చిక్కులు పెడుతున్నావయ్యా. నీకు టెంకాయలు కొట్టా" అని చింతిస్తూండే లోపల "ఏయ్ మిస్టర్! తప్పుకో" అంటూ ఓ సైకిలువాడు బెల్లు వాయించగా ఆ ప్రక్కనుండి వెళ్తున్న ఇద్దరు మలబారు ఏనుగుగున్నల్లాంటి పడుచుపిల్లలు ముసిముసినవ్వులు నవ్వారు.

గంధర్వులలోకంలో బంధువుల్ని కలుసుకుని భువికి జారినస్తున్న భూలోకాప్సరోంగనలా ఒయ్యారంగా బస్సు పై అంతస్థుమీంచి ఒక్కొక్కమెట్టే దిగుతూావున్న 'సులోచన్ని' చూడగానే యథాపూర్వంగా రావులుతప్పుతున్న గుండెను చేత్తో అదిమి పట్టుకున్నాడు సుబ్బారావు.

ఆమె ముందు నడుస్తూంది. ఊర్ధ్వలోకాన్నీ పాతాళాన్నీ మధ్యమధ్య పరామర్శిస్తూ నాలుగు గజాలు ఎడంగా తానూ నడుస్తున్నాడు. ఆవేళ హఠాత్తుగా వెనుదిరిగి చూడగానే గభాల్ని పక్కనున్న కిళ్ళీకొట్టువాడికి అణా యిచ్చాడు 'మీఠా' అంటూ.

ఎదురుగుండా ఆకాశమంతా జేగురురంగుని పులుముకుంది. మసీదు గోపురంపై పక్షులు రొద చేస్తున్నాయి. హోటల్లో ఆకాశవాణి కోకిలతా' గొంతుతో పాట పాడుతూంది. 'ప్రేమిస్తే భయమెందుకురా నాగమ్మా! దొంగతనంచేస్తే భయపడాలిగాని" అని రాగంతో అనురాగం ప్రబోధిస్తూంది.

"ఒరేయ్ సుబ్బారావు! తప్పు నీది కాదులే. నీ హృదయాన్ని ఆమె దోచుకుంది. నీవు ఆమె హృదయాన్ని దొంగిలించిన నేరం ఋజువైననాడు భయపడుదువుగాని—ఇప్పుడు దర్జాగా నడు" ధైర్యం చెప్పుకున్నాడు.

ఆమె ఒయ్యారంగా నడుస్తూంది. క్రింది పెదవి నొక్కిపట్టి ఠీవిగా తానూ నడుస్తూవున్నాడు.

ఈ ప్రేమ అనే పదార్థం ఎక్కడ పుట్టింది బాబూ — పట్టుకుందంటే ఓపట్టాన వదలదు.




హలో శాంతా! నీకోసమే వళ్ళంతా కళ్ళుచేసుకొని చూస్తున్నా!
తోలేటి కైవల్యనాథ్ (బందరు)




## నారసింహ లేహ్యం

ంగారుతో చేరినది. మేహము. ౩క్కాక, నిస్సత్తువ వగైరా హరించి బలము రక్తవృదికల్గించును. 20 తు॥ సీసా రు. 3-8-0. పోస్టేజీ రు. 1-1-0

. ఏ . అండ్ కంపెనీ ఆయుర్వేద సమాజం, పెరిదేపి (PO) నెల్లూరుజిల్లా.

## మాయపదవాలి

జీవిత రహస్యాలు:- మీ దాంపత్యసుఖానికి అనేక కామ సూత్రాలు:- ... రూ 3-50.
యువతి - స్త్రీలను గురించి అనేక కుతూహల విషయాలు ... రూ 3-50
సంతానము:- గర్భనిరోధానికి 60 నవీన సులభ మార్గాలు ... రూ 3-50.
పోష్టు ఖర్చులు చితం క్రింది ఎడ్రస్సుకువ్రాస్తే వి. పి. పోష్టుద్వారా మీయింటికి పంపబడును.

దేశసేవ ప్రచురణలు, ఏలూరు, (ఆంధ్ర)

దుర్గా ప్రాసెస

పేకాట
సమయమునకు
దివ్యమైన పాప్యులర్



పేకాటకు పదుగురూ కలుసుకొన్నపుడు వారిమధ్య మీరు పాప్యులర్ పేకను తప్పక చూస్తారు, ఎందుకంటే, ఆడుటకు సులువుగా ఉండే పాప్యులర్ పేకలు మేలు గకపు బోర్డులతో తయారు చేయబడినవి మరియు వీటి ఫినిష్, ఆకర్షణీయమైన డిజైనులు దివ్యముగా ఉంటాయి.

నేడే ఒక పాప్యులర్ పేకను కొనండి

POPULAR

పాప్యులర్ ఫైన్ ఆర్ట్ లిథో వర్క్స్
ప్రైవేట్ లిమిటెడ్
133.స, వకోలా, శాంతక్రుజ్, (ఈస్ట్)
బొంబాయి.55


# అరుణరాగం

పురాణాల్లోని అజన్మబ్రహ్మచారులు దీని నుండి ఎట్లా తప్పించుకొనిరొక్కో?

"నీ ఆలోచన్లకి ఫుల్‌స్టాప్ పెట్టి లోచనాలకి పనిచెప్పు. 'సులోచని' ఏ ఇంట్లోకి వెళ్ళగలదో చూడు" హెచ్చరిక.

"నాయనా! అయినా ఆమె ఇల్లు నీకెందుకు? కావాలంటే నీ సోది చెప్పుకోవడానికి లక్షణంగా బస్సు స్టాపు లేదూ?"

"నీకు తెలీదు. అలా కుదర్దులే"

శంకరంగాడి సెలవులై పోవొచ్చాయి. చెప్పుకున్నా ఇదంతా పసికట్టగలడేమో అసాధ్యుడు.

"సుబ్బరాయా! చూడు చూడు! ఆ మేడిచెట్టు కాడి పే... దానోకే వెళ్ళిందామె" రె ...!

... " ...

సుబ్బారావు వార పత్రిక తీసుకున్నాడు. ఆతురతగా పేజీలు తిరగేశాడు. తన "నల్ల కళ్ళజోడు" కథ! మురిసిపోయాడు—

...కో పేజీ తిప్పాడు. "గళ్ళ బుష్‌షర్టు" కథ!! హఠాత్తుగా అదరిపడి మేజామీది కూజాలోని తాజా మంచినీళ్ళు ఓగ్లాసెడు పట్టించి, తాపీగా కూర్చుండి చకచకా చదివేసి

"హారా! మాటలురావో, మౌనవ్రతమో అనుకున్న మగువతెగువ! తన బుష్‌షర్టు దులిపేసిందిగా, కేవలం కలంతో! పువ్వుల్లాంటి పెదవుల్లో ఇన్ని నవ్వులు దాచుకుందేం?" అనుకున్నాడు.

ఓ చుక్కలాటి అమ్మాయి, ఓ చక్కని అబ్బాయిని వలచి, అతను వేసికున్న గళ్ళ బుష్‌షర్టు రౌడీయిజానికి సంకేతమేమో అని తలచి, పరుగెత్తే ఊహల్ని వెనక్కి పిలచి, మనస్సును సందేహ తమస్సులు కలచివేయగా డైలమాలోపడే రసవత్తర ఘట్టాన్ని కథగా మలచింది.

ఏమి యా శైలి? ఏమి యా ఇతివృత్తం?

"అరుణ"ట! ఎంచక్కని పేరు.

"అబ్బ! సుబ్బరాయా! నీ రొట్టె నేతిలోపడిందిరా"

ఛటాలుమని తన గళ్ళబుష్‌షర్టు విడిచి, దండెం మీదకు రువ్వి, పెట్టె తెరచి 'ఛీ! తనకీ గళ్ళ గుడ్డల మోజేమిటబ్బా!' అని తిట్టుకుని, ఎట్టకేలకు అట్టడుగునవున్న ఆపద్బాంధవి తెల్లచొక్కానితీసి వేసుకుని, తెల్లప్యాంటులో టక్‌చేసి, ఇక ఛస్తే గళ్ళవి కొనగూడదని ఒట్టేసుకుని, ఇక బయల్దేరుదామా అనుకున్న శుభఘడియలోనే పెట్టే బెడ్డింగూ, అరటిగెలతోసహా శకునపక్షిలా శంకరం ఊడిపడ్డాడు.

"గూడ్! సుబ్బారావు! ఈవేళ ఏదో ఘనకార్యం చేయబోతున్నావల్లేవుంది. వెళ్ళిరా! ఇష్టకామ్యార్థ సిద్ధిరస్తు! ప్రపంచంలో ఎనిమిదో వింత పుట్టుందని నే ననుమానిస్తూనే వున్నాను. నేనా? నామాటకేంలే? 5 గంటల ప్యాసెంజరులోదిగి, కాలేజీకివెళ్ళి, నేరుగా అక్కణ్ణుంచి......" సాగదీస్తున్నాడు శంకరం.

"శంకరం! నీ వాగుడు చాలించి ఆ ఫ్లాస్కులో కాఫీ వుందిగానీ త్రాగెయ్. నే నిప్పుడే వస్తాను" అని చరచరా వెళ్ళిపోయాడు సుబ్బారావు.

గుడ్లప్పగించి చూస్తున్న శంకరానికి చేతిలో బరువుక్రిందపెట్టాలని తోచింది కొంతసేపటికి.

"ఏమిటబ్బా! సుబ్బారావువాలకం మారింది" అని ఓ ఫోజిచ్చుకుని ఆశ్చర్యపడిపోయాడు శంకరం.

* *

తలుపుతట్టి భయంభయంగ చూస్తూ నుంచున్నాడు సుబ్బారావు.

"నరుడా! సందేహమెందుకు?" అన్నట్టుగా, పరిహసించాడు మేడిచెట్టుమీద కిచకిచమంటూ ఒక వానరుడు.

"మిత్రమా! నీకున్న స్వేచ్ఛ మాకు లేదుగదా?" అని వాపోయాడు సుబ్బారావు. తలుపులు తెరచుకో ... సుబ్బారావుకళ్ళు జిగేల్‌మన్నాయి. బోలె ...శ్చర్యపడ్డాడు. ఆనందం ...గవళ్ళు తొక్కింది. వాలుగన్నులా? హరిణలోచనాలా?

"ఓహో! మీరా! దయచేయండి" అని చిరుసిగ్గుతో ఆహ్వానించి "మీపేరు సుబ్బారావుగారనుకుంటాను?" అని ప్రశ్నించింది అరుణ. చందనం బొమ్మకి ప్రాణం వొచ్చిందా? కోకిల పాడుతూందా వీణ పలుకుతూందా? అన్న భ్రాంతిలో తెల్లబోయాడు సుబ్బారావు.

"అలా చూస్తారేం? మీరు కథలో వ్రాసినట్టు నేను మూగదాన్నీ, గుడ్డిదాన్నీ కాలేదనా?" అని నవ్వి "నుంచుండిపోయారేం? లోపలకు రండి. మీలాంటి రచయిత కావాలంటే దొరుకుతాడా" అని దారితీసింది లోనికి. సుబ్బారావు సిగ్గుపడిపోయాడు. స్మృతిలోనికొచ్చి ఆమెననుసరించాడు.

పూజాగృహంలో ఓ పిలకజుట్టూ, గంధం బొట్టూవృద్ధుడు తుంగచాపమీద పడుకుని కునుకుతీస్తున్నాడు—

కక్ష్యాంతరములు గడచి, పెరట్లో మల్లె పందిరి క్రిందగల మడతకుర్చీలవద్ద ఆగి "కూర్చోండి—ఇప్పుడే వస్తా"నంటూ తుర్రుమంది—

"సుబ్బా! నీవు మూగవై నిక్షేపంలాంటి అరుణని మూగదాన్ని చేశావుకదా! నీకు కళ్ళులేక ఆమెను గుడ్డిగా చిత్రించావుగదా! శంకరంగాడు ఊరికే అన్నాడా నీకళ్ళను డాక్టరుపరీక్ష చేయించుకొమ్మని"

ఒయ్యారంగా కాఫీ కప్పులు బల్లమీద పెడుతూ "స్వీకరించండి" అంది.

"నిజం చెప్పమంటారా అరుణగారూ" అన్నాడు సుబ్బారావు.

"నాకు తెలుసు సుబ్బారావుగారూ! నాపేరు ఉత్తి అరుణే. 'గారు' లేదు. మీరు చెప్పబోయేది ఇంతదూరం కాఫీకోసం రాలేదని—అంతేనా? ఈవేళ గళ్ళ బుష్‌షర్టు వేసికోకపోవడమే దానికి ఋజువు—ముందు కాఫీ తీసికోండి" అంది ఓరచూపులో చిరునవ్వు మేళవించి—

పశ్చిమాకాశం అరుణరాగంతో నిండిపోయింది సుబ్బారావుహృదయంలా — తడి ఆరిపోయిన గొంతును తీయని కాఫీతో నింపేశాడు సుబ్బారావు.

★